**కథ**

**కారంపూడి వెంకట రామదాస్**

# మధురానుభూతి

"పవిత్రా! గుడ్ న్యూస్. నాకు ఎల్‌టీసీ సేంక్షన్ అయ్యింది. ప్రోగ్రామ్ కూడా ఫిక్స్ చేసేశా. ఈ దసరా సెలవలకి బెంగుళూర్. మైసూర్ టూర్ ప్లాన్ చేసా. ఇక టికెట్స్ బుక్ చేయడమే" భార్యతో ఆనందంగా అన్నాడు ప్రతాప్.

"చాలా సంతోషమండీ...మైసూర్‌లో దసరా సంబరాలు బాగా చేస్తారని టీవీల్లో ప్రతి ఏడాదీ చూస్తుంటాంగా..ముఖ్యంగా మైసూర్ ప్యాలెస్ అలంకరణ బాగుంటుందండీ. తప్పక చూడవలసిందే. అలాగే రిటన్‌లో బెజవాడ కనకదుర్గ దర్శనం కూడా చేసుకుంటే బాగుంటుందండీ" సంబరంగా అంది పవిత్ర.

"భలే...భలే..బెంగుళూర్‌లో విశ్వేశ్వరయ్య సైంటిఫిక్ మ్యూజియమ్ చాలా బాగుంటుందని విన్నాం. తప్పకుండా చూద్దాం" అన్నారు ప్రతాప్ పిల్లలు.

"సరే...రిటన్‌లో కనకదుర్గ దర్శనం కూడా చేసేస్తే ఓ పనైపోతుంది. అయితే ఈ ప్రపోజల్ అందరికీ అంగీకారమేనన్నమాట" అన్నాడు ప్రతాప్.

"యస్!" ముక్తకంఠంతో ఉత్సాహంగా అన్నారు పవిత్రా, పిల్లలు.

ప్రతాప్ ఆలోచిస్తున్నాడు. తనకి పది రోజులు సెలవు సేంక్షన్ అయ్యింది. పిల్లలకి ఎలానూ దసరా సెలవలు. ఇక వారి చదువు విషయంలో భయం లేదు. ఒక విధంగా పదిరోజులు ఎక్కువే. ముందుగా ట్రైన్ టికెట్స్. బెంగుళూర్, మైసూర్‌లో వుండేందుకు హోటల్స్ వివరాలకోసం కంప్యూటర్ని ఆశ్రయిస్తే సరిపోతుందనుకున్నాడు.

ఆ రోజే ఇంటర్‌నెట్లో సెర్చి ప్రారంభించాడు ప్రతాప్. గంటలో ట్రైన్ టికెట్స్ కాకా, తనకి అనుకూలమైన హోటల్స్‌లో రూమ్స్ తన ఏ.టి.యమ్. కమ్ డెబిట్ కార్డు నుపయోగించి బుక్ చేసేసాడు. రిటన్ ట్రైన్ టికెట్స్ విజయవాడ వరకు బుక్ చేసాడు. అక్కడ్నించి నాన్ స్టాప్ బస్‌లో తిరిగి హైదరాబాద్ చేరుకుంటే సరిపోతుందని అతడి ఆలోచన. తమ ప్రయాణానికి నెల పైనే టైముంది కాబట్టి మిగతా ఏర్పాట్లు తాపీగా చేసుకోవచ్చునుకున్నాడు. ఏదైనా ప్లాన్డ్‌గా చేయడం అతడికి మొదటి నుండి అలవాటు. అందులో యిలాంటి టూర్స్ మరీ జాగ్రత్తపడతాడు. ఆనందం కోసం మాత్రం వెళ్ళే యిటువంటి టూర్స్‌లో తీరా అక్కడ యిబ్బంది పడితే అర్థం ఏముంది? అదీ అతడి ముఖ్యోద్దేశం. అందుకే అంత జాగ్రత్త.

ooo

"ఏమండీ! మన ప్రయాణం ఎంత తొందరగా వచ్చేసిందండీ?" ఆనందంగా అంది పవిత్ర భర్తతో సామాన్లు సర్దుతూ.

"అవును. నాకూ అలాగే వుంది. అన్నీ సర్దావా..సాయంత్రమే మన ట్రైన్" అన్నాడు ప్రతాప్.

"ఆ..పెద్ద సూట్‌కేస్. పిల్లలిద్దరికీ చెరో ఎయిర్ బాగ్..పట్టుకున్నా" అంది పవిత్ర.

"సరే..నేకాస్త ఆఫీస్‌కి వెళ్ళి మధ్యాహ్నాంకల్లా వచ్చేస్తా" అంటూ బయటపడబోయాడు ప్రతాప్.

"వస్తూ..వస్తూ..ట్రైన్‌లో టైం పాస్‌కి స్నాక్స్, ఫ్రూట్సూ తీసుకురావడం మరచిపోకండి" గుర్తుచేసింది పవిత్ర.

"ఓ.కె." అంటూ కదిలాడు ప్రతాప్.

ఆ రోజే ప్రతాప్ కుటుంబం ట్రైన్‌నెక్కడం, బెంగుళూర్ చేరుకోవడం జరిగిపోయింది.

ooo

ప్రతాప్ కుటుంబం బెంగుళూర్లో మ్యూజియం, గార్డెన్స్ మిగతా చారిత్రక ప్రదేశాలు చూసీ చాలా ఎంజాయి చేసారు. తరువాత మైసూర్ చేరుకున్నారు.

"ఏమండీ..యిక్కడ దసరా ఉత్సవాలు చూసాక సాయంత్రం అలా షాపింగ్‌కి వెళ్దామండీ" అంది పవిత్ర.

"అవును పవిత్రా! దసరా ఉత్సవాలు చూసీ తిరిగి వస్తూ షాపింగ్ చెయ్యొచ్చులే"

"ముఖ్యంగా పిల్లలకి బట్టలూ..యిక్కడ ప్రసిద్ధి కాబట్టీ చందనం చెక్కా చందనంతో చేసిన బొమ్మలు లాంటివి కొందామండీ..."

"ఆ..అలాగే..." అన్నాడు ప్రతాప్.

ఆ సాయంత్రం చీకటి పడే వేళకి మైసూర్ ప్యాలెస్ చేరుకున్నారు. అక్కడ జనం సందడితో కళకళలాడిపోతోంది. ప్రజలు ఆనందోత్సాహాలతో పండగ వేడుకల్లో పాల్గొన్నారు. మైసూర్ ప్యాలెస్ విద్యుత్ దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అదో అద్భుతంగా తోచకతప్పదు.

ప్రతాప్‌తో పాటూ భార్య, పిల్లలు ఆ వాతావరణానికి మైమరచి ఆనందిస్తున్నారు. ఏనుగు మీద మైసూర్ రాజు. అతడికి ముందు సేనా బృందం ఊరేగింపునకు వచ్చారు. అది చూసి అక్కడి జనం ఆనందోత్సాహంతో చేతులూపుతూ వారికి అభివందనం చేస్తున్నారు. రాజు సైన్యమే కాక ఏనుగుల అలంకరణా చాలా అద్భుతంగా వుంది. మొత్తానికి ఆ కార్యక్రమం గంటపైగా తిలకించి అక్కడి నుండి కదిలారు ప్రతాప్ కుటుంబం.

మైసూర్ మెయిన్ రోడ్లో మంచి సిల్క్ షోరూమ్స్ వున్నాయని తెలుసుకుని అక్కడికి వెళ్ళదలచుకుని ఆటో పిలిచి ఎక్కాడు ప్రతాప్.

ప్రసిద్ధి చెందిన ఓ షోరూమ్‌లో అడుగుపెట్టారు. అక్కడి పట్టు వస్త్రాలు లైట్ల జిలుగులలో మెరిసిపోతున్నాయి.

"ఏమండీ..చూడండీ..ఎంత మంచి పట్టుచీరలో" అంటూ చీరల సెలక్షన్లో మునిగిపోయింది పవిత్ర.

పట్టుపంచల సెలక్షన్‌లో తలదూర్చాడు ప్రతాప్.

అరగంట ఏరివేతల కార్యక్రమం జరిగాకా ఓ అద్భుతమైన పట్టుచీరని బయటికిలాగి..

"ఈ చీరెలాగుందండీ?" ముచ్చటపడుతూ అంది పవిత్ర భర్తతో.

"బాగుంది. ఈ పట్టు పంచె చూడు ఎలాగుంది?" తిరిగి అడిగాడు ప్రతాప్.

ఇద్దరి సెలక్షన్ ఒకరికొకరు నచ్చడంతో వాటిని ఖాయం చేసారు. తరువాత కొడుక్కి సల్వార్ కమీజు కూతురికి పట్టులంగా జాకెట్లూ కూడా ఎంచి మొత్తం బిల్లు పేచేసి బయటపడ్డారు.


"ఏమండీ..మన ట్రిప్ అంతా చాలా హేపీగా జరిగిందండీ..ఆనందంగా రాత్రికి రైలెక్కేయొచ్చు" అంది పవిత్ర.

"అవును డాడీ..యిక్కడ చాలా బాగుంది!" అన్నారు పిల్లలు ఏక కంఠంతో.

ప్రతాప్‌కి కూడా మనసులో అంతా బాగా జరిగినందుకు సంతోషంగా వుంది.

చేతిలో బ్యాగులతో ఫుట్‌పాత్ మీద నడుస్తున్నారు. జనం బాగా వున్నారు. అసలే అది చాలా రద్దీగా వుండే మార్కెట్ ఏరియా! ఇంచుమించు ఒకరినొకరు రాసుకుంటూ నడుస్తున్నారు. తమ హోటల్‌కి వెళ్ళాలంటే రోడ్ క్రాస్ చేసి ఆటో ఎక్కాలి.

ఆ జనంలో ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తి ప్రతాప్‌ని గుద్దుకుంటూ ముందుకి వడివడిగా వెళ్ళిపోయాడు. ప్రతాప్‌కి చిరాకేసి అతడ్ని ఏదో అందామనే లోపే పరుగులాంటి నడకతో క్షణంలో ఆ జనం మధ్య కలిసిపోయాడా వ్యక్తి. ఎందుకో అనుమానం వచ్చి ప్యాంట్ పాకెట్ తడిమి చూసుకున్నాడు. గుండెలు గుభేలుమన్నాయి. పాకెట్లో వుండవలసిన పర్స్ ఆనవాలు లేదు. వెంటనే జేబులో చెయ్యి పెట్టి చూసుకునేసరికి పర్స్ మాయమైంది. పక్క జేబు తడిమి చూసుకున్నాడు. లాభం లేకపోయింది. దాంతో అతడికి విషయం అర్థమైంది క్షణాల్లో తను పిక్‌పాకెట్‌కి గురైనాడని. మాయ





మైన ఆ వ్యక్తే పిక్‌పాకటరని అర్థమైంది అతడికి. మెదడు మొద్దుబారిపోయింది. ఏం చెయ్యాలో తోచలేదు. ఆ వ్యక్తిని పట్టుకుందామని వెనక్కి తిరిగి పరుగు లంఘించుకున్నాడు. కాని ఆ సరికే ఆ వ్యక్తి జనంలో కనుమరుగయ్యాడు.

భర్త చర్య అర్థంకాక పవిత్ర ఆందోళన చెందింది.

"పవిత్రా! నా పర్స్ ఎవడో కొట్టేసాడు. అందులో ఐదువేల క్యాష్, ఏటియమ్ కార్డు వున్నాయి. ఇప్పుడేం చెయ్యాలో తోచడం లేదు" తల పట్టుకుని రొప్పుతూ అన్నాడు ప్రతాప్.

అవాక్కయిపోయింది పవిత్ర. నోట మాటరాలేదు. ఆ వెంటనే ఆమె మొహంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జరిగింది తెలుసుకునీ, పిల్లలు కూడా విచారానికి లోనైనారు.

కొద్ది నిమిషాల ముందున్న ఆనందం వారందరిలో ఒక్కసారిగా మాయమైంది.

"సరే! ముందు హోటల్‌కి వెళ్ళి ఏం చెయ్యాలో తాపీగా ఆలోచిద్దామండీ.." తేరుకుని అంది పవిత్ర.

రోడ్ క్రాస్ చేసి ఆటోలో హోటల్ చేరుకున్నారు. ఆటో దిగి పవిత్ర తన హ్యాండ్ బ్యాగ్‌లోంచి డబ్బు తీసిచ్చి పంపేసింది.

రూమ్ చేరుతూనే ప్రతాప్ మౌనంగా బెడ్ పై వాలిపోయాడు. 'యిప్పుడేం చెయ్యాలీ?' అన్న ప్రశ్న అతడి మెదడ్ని దొలిచేస్తోంది.

"ఏమండీ...యివాళ శనివారం. రేపూ ఎల్లుండి బ్యాంకులు సెలవ. ఈ ఊరు కానిఊరులో యిప్పుడెలా? నా పర్సులో

ఓ

రెండు వేలదాకా వుండకపోదు. దాంతో హోటల్ బిల్ కట్టేయొచ్చు. విజయవాడ వరకు టికెట్టులైతే వున్నాయి" అంది పవిత్ర.

"సరే..గుడ్డిలో మెల్ల..యిక్కడి నుండి బయటపడొచ్చన్నమాట! కాని ఆ పైన? అదే...విజయవాడ నుండీ హైదరాబాద్ ఎలా వెళ్ళడం?" అన్నాడు ప్రతాప్.

పవిత్ర ఆలోచనలో పడింది. బాగా ఆలోచించాకా..

"ఆ! ఓ దారి లేకపోలేదు?" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అంది పవిత్ర.

ప్రతాప్ మొహంలో చిన్న వెలుగురేఖ తళుక్కుమంది.

"అదీ..అదీ..నెల్లాళ్ళ క్రితం మనకో ఉత్తరం వచ్చింది గుర్తుందా?" అసలు విషయానికొస్తూ అంది పవిత్ర. పాత విషయాన్ని గుర్తు చేసింది పవిత్ర.

ooo

ఆ రోజు యింటికొస్తూనే ప్రతాప్ విన్న ముఖ్యమైన వార్త తన తండ్రి దగ్గర నుండీ ఉత్తరం వచ్చిందని.

"ఏమండీ! యిదిగో మామయ్యగారు రాసిన ఉత్తరం" చేతిలో వుంచింది పవిత్ర.

చిరాగ్గానే ఉత్తరాన్ని చింపి చదవనారంభించాడు.

"ప్రతాప్‌కి-

మీ నాన్న అనేక దీవెనలతో రాయునది. మీరు క్షేమమని తలుస్తా. ఒరే! నిన్నూ కోడల్నీ పిల్లల్ని చూసి చాలా రోజులైంది. ఈ దసరా సెలవలకి మన ఊరు వస్తే అందరం సరదాగా యిక్కడ గడపొచ్చు. అలాగే కనక దుర్గ నవరాత్రోత్సవాలని కూడా మనం అంతా కలసి తిలకించొచ్చు. మిమ్మల్ని మరీ మరీ రమ్మని మీ అమ్మ చెప్పమంది. మీ రాకకోసం ఆశతో ఎదురుచూస్తోంది ఆ

పిచ్చిది. ఈ కోరిక మన్నిస్తావని ఆశిస్తూ..

ఇట్లు
మీ నాన్న."

ఉత్తరం చదివి చిన్నగా నిట్టూర్చాడు ప్రతాప్. నాన్నా వాళ్ళు వుండేది విజయవాడ దగ్గర ఉయ్యూరు. పాత కాలం నాటి యిల్లు. పల్లె వాతావరణం. సిటీ కల్చర్‌కి అలవాటు పడ్డ భార్యా పిల్లలకి అంతగా నచ్చని ప్రదేశం. అక్కడ పుట్టి పెరిగిన తనే యిప్పుడు అక్కడికి వెళ్ళాలంటే అంతగా యిష్టపడడు. ఇక ఈ విషయం భార్యాపిల్లలకి చెప్పి వేస్ట్ అని మనసులో అనుకున్నాడు.

"ఏం రాసారండి?" అడిగింది పవిత్ర.

"ఆ..ఈ దసరా సెలవలకి నాన్న రమ్మనమని రాసారు" అని చెప్పి ప్రతాప్ భార్య రియాక్షన్ కోసం ఆమెకేసి చూసాడు.

పవిత్ర 'ఊ' అనలేదు, 'ఆ' అనలేదు. అయితే ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు ప్రతాప్. ఎందుకంటే తనకీ అక్కడికెళ్ళడం యిష్టంలేదు కాబట్టి. ఆ విషయాన్ని అప్పుడే మరచిపోయాడు కూడా.

ooo

"అంటే! యిప్పుడు మా ఊరు వెళ్దామంటావా?" ఏమీ అర్థంకాక అన్నాడు ప్రతాప్.

"మన టిక్కెట్లు విజయవాడ వరకేగా వున్నాయి. అక్కడి నుండి మీ ఊరు చాలా దగ్గర కదా.. ఇదొక్కటి నాకు మార్గంగా తోస్తోంది"

"ఊ..చేసేదేముంది?" నిస్సహాయంగా అన్నాడు ప్రతాప్.

పిల్లలకి విషయం అర్థమయ్యీ, కాకా అయోమయంలో వున్నారు.


"ఛా..పరిస్థితి యిలా వస్తుందనీ ఎప్పుడూ ఊహించలేదు. ఎప్పుడూ ఎవరి ముందూ చెయ్యి జాపలేదు. ఇప్పుడు మా నాన్నగారి ముందు తప్పేట్టు లేదు" బాధతో అన్నాడు ప్రతాప్.

"ఇంకా నయం. నా బ్యాగ్‌లో ఆ మాత్రం సొమ్ము వుండబట్టి యిక్కడి నుండి పరువుగా బయటపడుతున్నాం. లేకపోతేనో?" భయంతో అంది పవిత్ర.



నిజమే! ఊరుకాని ఊరులో నానా అవస్థ పడవలసొచ్చేది. ఊహకే భరించటం కష్టంగా వుంది ప్రతాప్‌కి.

"మొత్తానికి సరదాగా సాగిపోతున్న మన టూర్ ఈ అపశ్రుతి మూలంగా అప్‌సెట్ అయ్యిందండీ" నిట్టూరుస్తూ అంది పవిత్ర.




ప్రతాప్, పిల్లల్లో కూడా అదే భావం వ్యక్తమైంది.

ooo

విజయవాడకి ట్రైన్లో ఉదయమే చేరుకున్నారు ప్రతాప్ కుటుంబం. వారి మొహాల్లో ముభావమే ఎక్కువగా వుంది. ఇటు పవిత్రకి ఈ విధంగా అత్తగారింటికి వెళ్ళటం అస్సలు యిష్టం లేకపోయినా తప్పడం లేదు. స్టేషన్ నుండి బస్టాండ్ చేరుకుని లోకల్ బస్సులో ఉయ్యూరుకి చేరుకున్నారు.

గేటు చప్పుడు అవ్వడంతో తన తండ్రి విశ్వనాథం లోపల్నుండి వీధిలోకి తొంగి చూస్తూ ఆశ్చర్యానికి గురవ్వడం స్పష్టంగా కనిపెట్టాడు ప్రతాప్.

"రండ్రండి!" ఆనందంతో అన్నారు విశ్వనాథం.

"ఏమోయి! ఎవరొచ్చారో చూడూ? నీ ముద్దుల కొడుకూ కోడలూ వచ్చారు" సంబరంగా భార్య జానకి నుద్దేశించి అన్నారు విశ్వనాథం.

ఈ మాటలకి పరుగులాంటి నడకతో లోపల్నుండీ బయటకొచ్చింది జానకి.


"రారా..ప్రతాప్! రామ్మా..పవిత్ర! యిప్పటికైనా ఈ ముసలివాళ్ళని చూడాలని మీకు అనిపించడం సంతోషం" సంబరంగా అంది జానకి.

ఈ మాటలకి ప్రతాప్‌తోపాటూ పవిత్ర కూడా యిబ్బందికి గురైయ్యారు.

ఇది గమనించిన జానకి-

## స్విమ్‌సూట్‌లో త్రిష?

ఏంటీ ఇది నిజమే అనుకుంటున్నారా? ఓ తమిళ చిత్రం కోసం త్రిష స్విమ్‌సూట్‌లో హాట్ హాట్‌గా కనిపించబోతోంది అనేది చెన్నయ్‌లో చక్కర్లు కొడుతున్న తాజా వార్త. ఈ పాటని గోవాలో రాత్రిపూట షూటింగ్ చేస్తున్నారట కూడా. త్రిష ఇలాంటి గెటప్‌లో అలాంటి పాట చేయడమేంటీ అని అందరికీ డౌట్లు రావచ్చు. అయితే ఈ పాటలో ఎలాంటి అసభ్యం వుండదనీ, సినిమాలో చాలా కీలకమైందనీ... ఎంతో హృద్యంగా ఈ పాట వుంటుందని దర్శకుడు త్రిషకి నచ్చచెప్పాట్ట. అతని మాటలకు కన్విన్స్ అయిన త్రిష నటించడానికి ఒప్పుకుందని కోలీవుడ్ జనాల ఉవాచ.




"ఊరికే అన్నానేలేరా..ఆ..పిల్లల్ని చూసి ఎన్నాళ్లైందీ?" అంటూ ప్రేమతో పిల్లల్ని ముద్దాడుతూ దగ్గరికి తీసుకుంది జానకి.

"ఏమేవ్..! వాళ్ళని యింట్లోకి రానిస్తావా? అలా వీధిలో నిలబడి నీ ముచ్చట తీర్చుకుంటావా?" నవ్వుతూ అన్నారు విశ్వనాథం.

"నా సంబరం సంతకెళ్ళా...లోపలికి రండర్రా!" అంటూ అందర్నీ యింట్లోకి సాదరంగా తీసుకుని వెళ్ళింది జానకి.

ఆ రోజు జానక్కి పండగే అయ్యింది. నానా హడావిడీ చేసిందామె. ఉదయాన్నే రావడంతో పెసరట్టూ ఉప్మాతో మొదలుపెట్టిన ఆమె, మధ్యాహ్నం భోజనానికి రకరకాలైన వంటకాలతో పాటూ చంద్రకాంతలూ ఓపికతో చేసింది. అత్తగారు పడుతున్న అవస్థ చూసి పవిత్ర కూడా ఓ చెయ్యి వేసింది.

పిల్లలకైతే నాన్నమ్మ చేసిన పప్పు చాలా రుచికరంగా అనిపించింది. అదే విషయాన్ని అడిగితే, విశ్వనాథం-

"పిల్లలూ! ఇది కుక్కర్‌లో వండిన పప్పు కాదురా..యిత్తడి గిన్నెలో పొయ్యి మీద చేసిన ప్రత్యేకమైన పప్పు. అందుకే ఆ రుచి"

నిజమే. రుచిలోని తేడాని స్పష్టంగా గమనించారు ప్రతాప్, పవిత్రలు కూడా. ఇంటివద్ద పిల్లలైతే భోజనానికి రోజు అల్లరి చేసే వాళ్ళు. ఇవాళ గుటకలేసుకుని మరీ తింటుండటం వారికి వింతగా అనిపించింది. ఏదైతేనేం ఆ రోజు భోజనం అద్భుతంగా వుండటంతో అంతా తృప్తిగా భోంచేసారు.

మధ్యాహ్నం భోజనం అనంతరం, ప్రతాప్‌తో విశ్వనాథం మాటలు కదిపారు. కొడుకు ఉద్యోగం అదీ ఎలా వుందో అడిగి తెలుసుకున్నారు. ఇటు జానకి, పవిత్రా మాటల్లో పడ్డారు. అత్తగారి ఆరోగ్యం తరచి తరచి మరీ తెలుసుకుని తీసుకోవలసిన జాగ్రత్తలని సూచించింది పవిత్ర. జానక్కి కోడలి మాటలు ఊరటని కలిగించాయి. తరువాత ఆమె బీరువాలోనుండి ఓ కొత్త చీరని బయటకి తీసి-

"అమ్మా పవిత్రా! ఈ చీర నీ గురించే ఆ మధ్య తీసుకున్నాను. ఎలా వుందో చెప్పు?" అందామే చీర పవిట చెంగు విప్పి చూపిస్తూ.

"చాలా బాగుంది అత్తయ్యా! అయినా యిప్పుడు నాకెందుకు?" మొహమాటపడుతూ అంది పవిత్ర.

"అదేంటమ్మా. మీరెలాగో పండక్కి వస్తారని తీసుకున్నా-ఏదైతేనేం, ఒకరోజు అటూయిటూగా వచ్చారు" అంది జానకి.

పవిత్ర మనసులో ఆలోచనలు వేరేగా ఉన్నాయి. అసలు ఏ పరిస్థితిలో వారిక్కడికొచ్చారో అత్తామామలకి తెలిస్తే వారు చాలా నిరుత్సాహ పడతారని తలచుకునీ మౌనంగా వుండిపోయింది.

"నానమ్మా...అమ్మకేనా? మాకు ఏం కొన్నావ్" అడిగారు ప్రతాప్ పిల్లలు.

"యిష్..." అని పిల్లల్ని వారించింది పవిత్ర.


వీరి సంభాషణ విన్న విశ్వనాథం- "లేదురా పిల్లలూ..మీకు నచ్చినవి సాయంత్రం స్వయంగా వెళ్ళి కొందాం లెండి"

పిల్లల మొహాల్లో ఆనందం తొంగి చూసింది. వారికి తాతయ్య యిల్లు చాలా నచ్చింది. ముఖ్యంగా యింటి చుట్టూ వున్న ఖాళీ స్థలంలో మామిడి, జామ చెట్లూ..మల్లె, జాజి పూల మొక్కలూ వుండటంతో పచ్చగా వుంది పరిసరం. ఆ చెట్ల చుట్టూ దాగుడు మూతలాడుతూ పిల్లలు కేరింతలు కొట్టారు. వారలా ఆడుకుంటూ తమ కళ్ళముందు ముచ్చటగా తిరుగాడుతుంటే చూసి చాలా సంబరపడ్డారు ఆ ముసలి దంపతులు.

ఆ రోజు సాయంత్రం విజయవాడకి వెళ్ళి కనకదుర్గ దర్శనం చేసుకోవడమే కాక, షాపింగ్ కూడా చేసి పిల్లలకి నచ్చినవే కాకా ప్రతాప్ కూడా బట్టలు కొనిపెట్టారు విశ్వనాథం. వారు చూపిన అప్యాయతాభిమానాలతో ముఖ్యంగా పవిత్రా పిల్లలు ఉక్కిరిబిక్కిరయ్యారు.

## ఇలియానా రూటే వేరు

ఇలియానా ఇప్పుడు ఒకేసారి ఐదు సినిమాల్ని ఒప్పేసుకుంది. విష్ణు, రవితేజ, నితిన్‌లతో నటిస్తున్న సినిమాలు నిర్మాణాలు మొదలైపోయాయి కూడా. వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్‌లతో చెరో సినిమా చేయడానికి అంగీకరించిందట. ఒకటి రెండు కాకుండా ఏకంగా ఐదు సినిమాలు ఒప్పుకోవడం ద్వారా ఇలియానా తనదైన ట్రెండ్‌ని సృష్టించుకుంటోందిప్పుడు. సినీ పండితుల లెక్కల ప్రకారం ఐదు సినిమాలకీ ఐదు కోట్లు అందుకుంటుందిట ఇలియానా.



ఆ సాయంత్రం అక్కడ గడిపి రాత్రికి తిరిగి అంతా యింటికి చేరుకున్నారు.

○○○

ప్రతాప్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తండ్రిని దబ్బద గాలంటే ఒక వైపు మనసు ఒప్పుకోవడం లేదు. అంతే కాదు తీగలాగితే డొంకంతా కదులుతుంది. తప్పని పరిస్థితిలో తమ వద్దకి వచ్చేరేగానీ తమ మీద అభిమానంతో కాదని తెలిస్తే ఆ ముసలి హృదయాలు గాయపడక తప్పదు. తమని చూసుకుని తల్లిదండ్రులు ఎంతో ఆనందంగా వున్నారు. ఆ విషయం వారిని చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. అంతేకాదు ఈ సంతోషం వారిలో ఏదో నూతనోత్సాహం కలిగిస్తోంది. ఇప్పుడు అసలు విషయం చెప్పి వారి ఆనందాన్ని దోచుకోవడం న్యాయం కాదనిపించింది ప్రతాప్‌కి.

ఆ రోజు భోజనాల అనంతరం ప్రతాప్ ఒంటరిగా డాబా ఎక్కి వెన్నెల చల్లదనాన్నీ, పిల్లగాలుల పలకరింపుని ఆస్వాదిస్తున్నాడు. యింతలో విశ్వనాథం అక్కడికి చేరుకున్నారు.

"ప్రతాప్! యిందరా..ఈ సొమ్ముంచు" అన్నారు విశ్వనాథం.

"సొమ్మా? నాకా? ఏం.. యిప్పుడెందుకూ?" తడబడుతూ అన్నాడు ప్రతాప్.

"ఊ..ఏం..రా..! ఈ నాన్న దగ్గరా నీకు దాపరికం?" బాధతో అన్నారు విశ్వనాథం.

"ఏంటి నాన్నా నువ్వంటున్నదీ?" అయోమయంగా అన్నాడు ప్రతాప్.

"ఉదయం..నువ్వు స్నానం చేసే సమయంలో నీ మొబైల్ ఫోన్ మ్రోగింది" అంటూ చెప్పుకొచ్చారు విశ్వనాథం.

○○○

విశ్వనాథం వాలు కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ఈలోగా టేబుల్ మీదున్న సెల్‌ఫోన్ కమ్మని పాటతో నెమ్మదిగా మ్రోగింది. అది ప్రతాప్ సెల్ ఫోన్. విశ్వనాథం యిటు ఇటు చూసారు కొడుకొచ్చి ఫోను తీస్తాడేమోనని. కాని ప్రతాప్ జాడ ఎక్కడా లేదు. ఈలోగా రింగ్ ఆగిపోయింది. రెండు నిముషాలు గడవకముందే మళ్ళీ మ్రోగింది ఫోన్. ప్రతాప్ జాడ లేకపోయేసరికి విశ్వనాథం లేచి వెళ్ళి కాల్ రిసీవ్ చేసుకుని హలో అన్నారు.



''బావా..జరిగింది తెలిసి చాలా బాధపడ్డాను. చెల్లి ఫోన్లో అంతా చెప్పింది. మీ బెంగుళూర్ ట్రిప్ యిలా ముగుస్తుందని అనుకోలేదు. ఒక్కొక్కసారి కొత్త ప్రదేశాల్లో ఊహించనివి జరగడం సహజం. అయినా...అంత సొమ్ము పోగొట్టుకుని పోలీసులకి కంప్లైంట్ ఎందుకు యివ్వలేదు? పోనీలే..అదీ తలనొప్పే..." యిలా మాట్లాడుకుంటూ పోయింది అవతలి గొంతు.

"ఊ...ఊ..." అంటూ అంతా విన్నారు విశ్వనాథం. చూచాయగా అతడికి విషయం అర్థమైంది.

○○○

"నీ బావమరిది నువ్వేననుకుని అసలు విషయం ఫోన్‌లో నాతో అంతా చెప్పాడు. ఏంరా..బాధనంతా నీ మనసులోనే దాచుకుని కుమిలిపోవాలా? జరిగిందిదీ..అని ఒక్క ముక్క చెప్పి నా సహాయం తీసుకోకూడదా?" అన్నారు విశ్వనాథం.

"నాన్నా!" అప్పటివరకూ తనలో తానే వేదన అనుభవిస్తున్న ప్రతాప్ చాలా ఎమోషనల్‌గా అన్నాడు.

"అర్థమైందిగా..జరిగింది చెప్తే మేము బాధపడతామనే కదా నీ బాధంతా? ఊ...అదీ నిజమే"

"నన్ను క్షమించండి నాన్నా..మీరు ఎంతో అభిమానంతో మమ్మల్ని పండక్కి రమ్మంటే నేను అంతగా పట్టించుకోలేదు. కానీ తనొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుందంటారే..యిదేనేమో"

"సర్లేరా..ఎలాగో అలాగా వచ్చారు కదా? యిప్పుడదంతా ఎందుకూ?" ఓదారుస్తూ అన్నారు విశ్వనాథం.

మళ్ళీ అతడే-

"ఒరే..నాదో చిన్న మనవి. ఈ విషయం మన మధ్యే వుండనీరా..నీ తల్లికి అసలు విషయం తెలిస్తే ఆ పిచ్చిది తట్టుకోలేదు" అన్నారు విశ్వనాథం గద్గద కంఠంతో.

"నాన్నా..." బాధతో అన్నాడు ప్రతాప్. విశ్వనాథం మౌనంగానే కొడుకుని ఓదార్చారు.

○○○

ఒకవైపు నానమ్మ పెట్టిన తియ్యటి పిండివంటలతో పాటూ తియ్యని మధురానుభూతుల్ని కూడా కూడగట్టుకుని పిల్లలూ - మరో వైపు తప్పుచేసిన భావనతో ప్రతాప్, పవిత్రలు. విశ్వనాథం జానకిలకి బాధతో వీడ్కోలు చెప్పి హైదరాబాద్ పయనమైయ్యారు.

దారిలో పిల్లలు ప్రతాప్‌తో..

"నాన్నా! యింత మంచి నానమ్మా, తాతయ్యా, చక్కటి ఆ ఊరు వుండగా ఎందుకెక్కడెక్కడికో ప్లాన్ చేసారు?" మనసులో మాటని ప్రశ్న రూపంలో బయట పెట్టారు.

సమాధానం చెప్పలేని ఆ ప్రశ్న ప్రతాప్‌నే కాదు పవిత్ర హృదయాన్ని కూడా సూటిగా తాకింది.

○

## అదేం లేదు

మణిరత్నం కొత్త చిత్రానికి సిమ్రాన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తోందనే వార్తలు ఇటీవల జోరుగా వినిపించాయి. అయితే వీటిలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పేసింది సిమ్రాన్. 'మణిరత్నంగారితో 'అమృత' సినిమా చేసాను. అలాంటి గ్రేట్ డైరెక్టర్‌కి అసిస్టెంట్ పని చేయడం నిజంగా అదృష్టం. కానీ నాకు అసైన్‌మెంట్ల రీత్యా నేను ప్రస్తుతానికి అసిస్టెన్స్ చేయడంలేదు. మళ్లీ అలాంటి మంచి అవకాశం ఎప్పుడొస్తుందో ఎదురుచూడాల్సిందే' అంటోంది సిమ్రాన్.